పన్నుల వసూళ్లకు పరుగులు !

వందశాతం లక్ష్య సాధనకు నెలాఖరు వరకే గడువు

- పన్నుల వసూళ్ల కోసం అధికారుల ప్రత్యేక డ్రైవ్
- రోజువారీ వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు
- 11 పంచాయతీల్లో వంద శాతం వసూలు

పల్లెల అభివృద్ధికి పన్నులే ప్రధాన ఆదాయ వనరు. ఇవి సకాలంలో వసూళ్లు అయితేనే పల్లె ప్రగతి సాధ్యమవుతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేస్తున్న ఆర్థిక సంఘం ఎస్‌ఎఫ్‌సీ నిధులతో పాటు ఇంటి పన్నులు కీలకంగా మారాయి. ఉన్న వనరులను ఎలాగైనా రాబట్టు కోవాలనే ఉద్దేశంతో పంచాయతీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగింపుకు మరో 7 రోజులే మిగిలాయి. పన్ను వసూళ్లలో పాలేరు డివిజన్‌ను ప్రథమ స్థానంలో ఉంచేందుకు అధికార యంత్రాంగం కృషి చేస్తుంది.



వంద శాతం వసూలు చేసిన రాజారాంపేట పంచాయతీ కార్యాలయం

నేలకొండపల్లి: పాలేరు నియోజకవర్గంలో పంచాయతీలకు పంపిణీ చేసిన ట్రాక్టర్లు ఇతర నిర్వహణ వ్యయం భారంగా మారుతుండటంతో ఆదాయ వనరులైన పన్ను వసూళ్లపై అధికారులు దృష్టి పెట్టారు. ఆయా పంచాయతీల్లో ఎంపీడీఓ, ఎంపీఓ, పంచాయతీ కార్యదర్శులు వంద శాతం పన్ను వసూళ్లే లక్ష్యంగా నిత్యం ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నారు. దాదాపు అన్ని పంచాయతీలకు కార్యదర్శులు ఉండటంతో మండల పంచాయతీ అధికారులు వారిని పురమాయిస్తున్నారు. ఎక్కువ శాతం వసూలు చేయించేలా పర్యవేక్షిస్తున్నారు. వంద శాతం పన్నుల వసూళ్లే లక్ష్యంగా రోజు వారీగా వసూలు చేసిన పన్ను వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తూ ముందుకెళ్తున్నారు.

కార్యదర్శులపై భారం..

పంచాయతీ కార్యదర్శులు విధి నిర్వహణలో ఇబ్బందులు పడుతున్నారు. రోజు ఉదయం ఏడింటికే వచ్చి పారిశుద్ధ్యం, నీటి సరఫరా చూస్తున్నారు. వీటికి తోడు పన్నుల వసూళ్ల లక్ష్యం ఉండటంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. కొన్ని గ్రామాల్లో ప్రజలు, స్థానిక ప్రజాప్రతినిధులు సహకారం ఉండట్లేదు. ప్రతీ రోజు పంచాయతీ డిమాండ్‌లో 5 శాతం వసూలు చేయాలనే ఆదేశాలు ఉండటంతో కార్యదర్శులు మల్టీపర్పస్ వర్కర్లు కలిసి పన్ను వసూళ్లను వేగవంతం చేస్తున్నారు.

గువ్వలగూడెంలో పన్నుల వసూళ్లకు స్పెషల్ డ్రైవ్..

నేలకొండపల్లి మండలంలోని గువ్వలగూడెం పంచాయతీలో కార్యదర్శి లేకపోవటంతో ఎంపీడీఓ కె.జమలారెడ్డి ప్రత్యేక బృందంతో గురువారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. బోళ్ల వీరబాబు(కోనాయిగూడెం), లింగరాజు(కోరట్లగూడెం), హరినాయక్(రాజారాంపేట) పంచాయతీ కార్యదర్శులతో పాటు మండల పరిషత్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తున్న క్రాంతి, దివ్య, సునీతలతో ఇంటింటా తిరిగి పన్నుల వసూళ్ల కార్యక్రమం చేపట్టారు. ఎంపీడీఓ కె.జమలారెడ్డి, మండల పంచాయతీ అధికారి సీహెచ్.శివలు పర్యవేక్షణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నూరుశాతం పన్నుల వసూళ్లకు చర్యలు తీసుకున్నామని అందుకు ప్రజలు సహకరించాలని కోరారు.


పన్ను వసూలు చేస్తున్న ప్రత్యేక బృందం

వంద శాతం సాధించిన 11 జీపీలు ఇవే..

పాలేరు డివిజన్‌లో మొత్తం 141 జీపీల్లో 11 జీపీలు నూరు శాతం సాధించగా.. మిగతావి 80 నుంచి 90 శాతం వరకు వసూళ్లు అయ్యాయి. నూరుశాతం సాధించిన జీపీల వివరాలిలా.. నేలకొండపల్లి మండలంలోని 32 జీపీల్లో రాజారాంపేట, కూసుమంచి మండలంలోని 41 జీపీల్లో జక్కేపల్లి, చౌటపల్లి, లోక్యాతండా, గురవాయిగూడెం, సంధ్యాతండాలతో పాటు మరో రెండు జీపీలు, తిరుమలాయపాలెం మండలంలోని 40 జీపీల్లో మంగలితండా, జోగులపాడు, తాళ్లచెరువు, ఖమ్మం రూరల్ మండలంలోని 28 జీపీల్లో అన్నీ వంద శాతంకు దగ్గర్లో ఉన్నాయి.

మూడేళ్లుగా వంద శాతం వసూళ్లు..



పంచాయతీ ఏర్పడిన మూడేళ్ల నుంచి వంద శాతం పన్నులు వసూలు చేస్తున్నాం. అందుకు గ్రామ ప్రజలకు రుణపడి ఉంటాం. పంచాయతీ సిబ్బంది, పాలకవర్గం సభ్యుల సమన్వయంతో ముందుకు సాగుతూ వసూలు చేశాం.

– కె.ధనలక్ష్మి, రాజారాంపేట, సర్పంచ్

అందరి సహకారంతోనే..



గ్రామంలో రెండు నెలల ముందే వంద శాతం వసూలు చేసేందుకు గ్రామస్తులు అంతా సహకరించారు. పాలకవర్గం ప్రత్యేక చొరవ తీసుకుని వంద శాతం పన్నులు వసూళ్లే లక్ష్యంగా అహర్నిశలు కష్టపడ్డారు. సహకరించిన గ్రామస్తులకు, పాలకవర్గానికి పంచాయతీ తరపున కృతజ్ఞతలు.

– హరి, పంచాయతీ కార్యదర్శి, రాజారాంపేట

నూరు శాతం లక్ష్యం..



పంచాయతీల్లో పన్నుల వసూళ్ల కోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టాం. మండల లక్ష్యం రూ.2 కోట్లు కాగా.. ఇప్పటి వరకు రూ.1.50 కోట్లు సాధించాం. నెలాఖరు నాటికి పూర్తి చేస్తాం. వంద శాతం సాధించిన రాజారాంపేట పంచాయతీ పాలక వర్గానికి ప్రత్యేక కృతజ్ఞతలు.

– కె.జమలారెడ్డి, ఎంపీడీఓ, నేలకొండపల్లి

ఆదర్శ పంచాయతీగా రాజారాంపేట..

నేలకొండపల్లి మండలంలోని మారుమూల గ్రామమైన రాజారాంపేట పంచాయతీ ఎంపీడీఓ కె.జమలారెడ్డి, మండల పంచాయతీ అధికారి శివ నిత్యం పర్యవేక్షణ కారణంగా నూరు శాతం సాధించి ఆదర్శంగా నిలుస్తుంది. పంచాయతీ కార్యదర్శి హరినాయక్, సర్పంచ్ కుండా ధనలక్ష్మి ప్రతీ రోజు గ్రామస్తులను ప్రత్యేకంగా కలిసి పన్నులు గురించి వివరించి వసూలు చేశారు. రెండు నెలల క్రితమే వంద శాతం వసూలు చేసి ఆదర్శంగా నిలిచి డివిజన్‌లోనే తనదైన ముద్ర వేసుకుంది.

క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం


చెక్కు అందజేస్తున్న రామాశ్రీను

కూసుమంచి: మండలంలోని మునిగేపల్లి గ్రామంలో గౌడ కులస్తుల ఆధ్వర్యంలో నిర్మిస్తున్న కంఠమేశ్వరస్వామి ఆలయానికి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు రామాశ్రీను రూ.1,01,116 లను గురువారం విరాళంగా అందించారు. సర్పంచ్ గుగ్గిళ్ల మోహన్, ఉప సర్పంచ్ ముక్కా శ్రీనివాసరావు, బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు రామా వీరభద్రం పాల్గొన్నారు.

పొంగులేటి పరామర్శ


పరామర్శిస్తున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని వేణుగోపాల్‌నగర్‌లో ఇటీవల నాగరాణి ఆత్మహత్యకు పాల్పడగా.. గురువారం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం నాగరాణి కుటుంబ సభ్యులను ఆమె ఇంటి వద్ద పరామర్శించారు. ఈ సందర్భంగా నాగరాణి చిత్రపటానికి పూలు చల్లి నివాళులర్పించాక ఆర్థిక సాయం అందజేసి భవిష్యత్తులో అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఆయన వెంట దుంపల రవి కుమార్, దుర్గ, ఉమ్మినేని కృష్ణ, చైతు, కొడాలి గోవిందరావు, మందడపు నాగేశ్వరరావు, అజ్మీరా అశోక్‌నాయక్, జగన్, బందెల గోపి, వైకుంఠపు రంజిత్, తమ్మినేని కోటి, బద్రి, ఓర్సు రవి తదితరులు ఉన్నారు.

108 కలశాలతో స్వామివారికి అభిషేకం


కలశాలను ఊరేగింపుగా తీసుకొస్తున్న భక్తులు

ఖమ్మంఅర్బన్: నగరంలోని 4వ డివిజన్ యూపీహెచ్ కాలనీలోని శ్రీ అభయ వేంకటేశ్వరస్వామి దేవాలయ 19వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా గురువారం 108 కలశాలతో స్వామివారికి అభిషేకం చేశారు. అనంతరం నిర్వహించిన నిత్యారాధన, సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. శుక్రవారం స్వామివారి కల్యాణోత్సవం, ఊరేగింపు నిర్వహించబడుతుందని దేవాలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు మేకల వీరన్న, గుగులోత్ మణికంఠలు తెలిపారు. ఈ వేడుకల్లో గౌరవ అధ్యక్షుడు జెల్లి కొండలరావు, ప్రచార కార్యదర్శి పురం తిరుపతయ్య, కార్పొరేటర్ కార్యవర్గ సభ్యుడు దండాజ్యోతిరెడ్డి, బొల్లి కొమరయ్య, సత్యం, సుబ్బాచారి, గణేష్, సూర్యం, మల్సూర్, తదితరులు పాల్గొన్నారు.

26న పూర్వ విద్యార్థులు హాజరుకండి

ఖమ్మం సహకారనగర్: యూజీసీ ద్వారా న్యాక్ గుర్తింపు కోసం అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ తగిన ఏర్పాట్లలో ఉందని, ఈ క్రమంలో పూర్వ విద్యార్థులంతా ఈ నెల 26వ తేదీన నగరంలోని ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాలలోని అధ్యయన కేంద్రానికి హాజరు కావాలని స్టడీ సెంటర్ రీజినల్ కో ఆర్డినేటర్ మహ్మద్ జకీరుల్లా ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు 96189 44654 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

'ఎస్‌బీఐటీ' విద్యార్థుల క్షేత్రస్థాయి పర్యటన

రఘునాథపాలెం: నగరంలోని ఎస్‌బీఐటీ విద్యార్థులు అగ్రిటెక్ ఇంటర్న్‌షిప్‌లో భాగంగా మండలంలోని సూర్యాతండాలో గల పొలాల్లో గురువారం క్షేత్రస్థాయిలో పంటల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ జి.కృష్ణ, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జి.ధాత్రిలు మాట్లాడగా.. అకడమిక్ డైరెక్టర్లు ఏవీవీ శివప్రసాద్, ప్రవీణ్‌కుమార్, సుభాష్ చందర్, రవీంద్రబాబు, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	సార్
వినోద	బలగం
సాయిరాం	జాన్ విక్: చాప్టర్ 4
ఆదిత్య	కబ్జా
శ్రీనివాస	దాస్ కా దమ్కి
సుందర్	రంగ మార్తాండ

– ఖమ్మంవ్యవసాయం

ఉత్తమ పంచాయతీ సర్పంచ్‌లకు సన్మానం


ఎంపీడీఓకు ప్రశంసా పత్రం అందించి సన్మానిస్తున్న ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి

ఖమ్మంరూరల్: మండలంలోని ఉత్తమ పంచాయతీలుగా ఎన్నికైన ఆయా పంచాయతీల సర్పంచ్‌లను, గ్రామ ప్రత్యేకాధికారులను గురువారం ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పల్లెసీమల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని అందుకు సర్పంచ్‌లు, అధికారులు తమ వంతుగా గ్రామాల్లో మౌలిక వసతులు కల్పనకు పాటుపడాలని తెలిపారు. అనంతరం ప్రశంసా పత్రాలను అందించారు. అదేవిధంగా తీర్థాలలో ఇటీవల మృతి చెందిన భూక్యా భీకునాయక్ కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 10వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ అశోక్‌కుమార్, ఎంపీపీ బెల్లం ఉమ, జెడ్పీటీసీ ఎ.వరప్రసాద్, సుడా డైరెక్టర్ గూడి సంజీవరెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ..

కూసుమంచి: మండలానికి చెందిన 69 మంది లబ్ధిదారులకు రూ.24.44లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను గురువారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి అందజేశారు. ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పేదలకు వరంగా మారాయని, ఆపదలో ఆదుకుంటున్న సీఎం కేసీఆర్‌కు అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

నేడు 'కందాల' పర్యటన..

తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెం మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉత్తమ పంచాయతీలకు జాతీయ అవార్డుల పురస్కారాల ప్రదానోత్సవం కార్యక్రమంలో ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి పాల్గొంటారని ఎంపీడీఓ జయరాం ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందజేయనున్నారని ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

'కంటి వెలుగు' దేశానికే ఆదర్శం

నేలకొండపల్లి/కూసుమంచి: కంటి వెలుగు పథకం దేశానికే ఆదర్శమని కూసుమంచి ఎంపీపీ బాణోత్ శ్రీనివాస్‌నాయక్, నేలకొండపల్లి ఎంపీడీఓ కె.జమలారెడ్డి సూచించారు. గురువారం కూసుమంచి మండలంలోని గోరీలపాడుతండాలో ఎంపీపీ, నేలకొండపల్లి మండలం నాచేపల్లిలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమాలను ప్రారంభించిన సందర్భంగా వారు మాట్లాడారు. ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని, ప్రతి ఒక్కరూ కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో వైద్యాధికారులు, ఆర్.శ్రావణ్‌కుమార్, మణిబాబు, షేక్ జానీపాషా, సరోజిని, సర్పంచ్‌లు మందడి రాజేష్, బాణోత్ సరస్వతీ, ఎంపీటీసీ బాబూరావు, పంచాయతీ కార్యదర్శి సురేష్, మాజీ సర్పంచ్ నేరళ్ల నరసింహారావు, నాయకులు పరుశురాం, శ్రీను, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


కూసుమంచి: శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ

చట్టబద్ధత కల్పించాలి


పాదయాత్రకు సంఘీభావం తెలుపుతున్న నాయకులు

నేలకొండపల్లి: ఎస్సీ వర్గీకరణకు పార్లమెంట్‌లో చట్టబద్ధత కల్పించాలని మాదిగల సంగ్రామ పాదయాత్ర పాలేరు ఇన్‌చార్జ్ అశోక్ డిమాండ్ చేశారు. గురువారం ఈమేరకు మండలంలో అప్పలనరసింహాపురంలో పాదయాత్ర ప్రారంభించి రాయగూడెం, కొంగర, చెరువుమాదారం గ్రామాల్లో యాత్రను కొనసాగించగా.. పలువురు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ.. ఏప్రిల్ 4న చేపట్టనున్న హైదరాబాద్ దిగ్బంధనాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ వెంకటేశ్వర్లు, వంగూరి ఆనందరావు, పగిడికత్తుల ఈద య్య, తోళ్ల సురేష్, వి.హనుమంతరావు, శ్రీకాంత్, భరణి, శ్రీను, వినయ్, జస్వంత్, వీరబాబు, పి.బాలస్వామి, వెంకటేశ్వర్లు, నరసింహారావు, వెంకన్న, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

నేలకొండపల్లి: మండలంలోని వివిధ గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన పలు కుటుంబాలను పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి సతీమణి విజయమ్మ గురువారం పరామర్శించి మృతుల చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఒక్కో కుటుంబానికి రూ.10వేల చొప్పున 41 కుటుంబాలకు ఆర్థిక సాయమందించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ మరికంటి ధనలక్ష్మి, ఎంపీపీ వజ్జా రమ్య, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ శాంత, రైతు సమన్వ సమితి మండల అధ్యక్షుడు శాఖమూరి సతీష్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సొసైటీ చైర్మన్లు, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ నాటిన మొక్క దగ్ధం

నేలకొండపల్లి: మండలంలోని సింగారెడ్డిపాలెం వద్ద సాగర్ కెనాల్ కట్టపై కలెక్టర్ వీ.పీ.గౌతమ్ నాటిన మొక్కను గుర్తు తెలియని వ్యక్తులు తగలబెట్టారు. గతేడాది జూన్ 16న కలెక్టర్ మండల పర్యటనలో భాగంగా సింగారెడ్డిపాలెం కాల్వపైమొక్క నాటారు. రెండు రోజుల క్రితం మొక్క సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు చెత్తకు నిప్పు పెట్టడంతో మొక్క కూడా పూర్తిగా కాలిపోయింది.

రామయ్య పెళ్లికి గోటి తలంబ్రాలు..

నేలకొండపల్లి: భద్రాచలం దేవస్థానం నిర్మాత, పరమ భక్త గ్రేసరుడు కంచర్ల గోపన్న(భక్తరామదాసు) జన్మస్థలంలో ఈ నెల 30న మందిరంలో జరగనున్న రామయ్య కల్యాణానికి గోటి తలంబ్రాలను తయారు చేస్తున్నారు. గురువారం స్థానిక రామదాసు ధ్యాన మందిరంలో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించి దాదాపు 10 కిలోల తలంబ్రాలకు సిద్ధం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్ ప్రతినిధులు, మహిళ భక్తులు, పూజారి సౌమిత్రి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి ప్రదర్శనను జయప్రదం చేయండి

ఖమ్మం సహకారనగర్: పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని తదితర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన ప్రదర్శన నిర్వహించనున్నట్లు టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీవీ నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. సకాలంలో అందరూ హాజరై జయప్రదం చేయాలని కోరారు.

జన చైతన్య యాత్ర..

నేలకొండపల్లి: బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలపై క్షేత్రస్థాయిలో ఉద్యమించి ప్రజలను చైతన్యం చేయాలనే ఉద్దేశంతో ఈ నెల 17 నుంచి 29 వరకు చేపట్టిన జన చైతన్య యాత్ర 25వ తేదీన నేలకొండపల్లికి చేరుకుంటుందని, ప్రతి ఒక్కరూ ఈసభలో పాల్గొని జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి కే.వీ.రెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని రావెళ్లభవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పాల్గొంటారని, మోటార్ సైకిల్ ర్యాలీ ఉంటుందని తెలిపారు. ఈ విలేకర్ల సమావేశంలో మాజీ ఎంపీపీలు సిరికొండ ఉమామహేశ్వరీ, రచ్చా నరసింహారావు, ఐద్వా కార్యదర్శి బెల్లం లక్ష్మి, ఏటుకూరి రామారావు, గుడవర్తి నాగేశ్వరరావు, కట్టెకోల వెంకన్న, దుగ్గి వెంకటేశ్వర్లు, పెద్దిరాజు నర్సయ్య, మారుతి కొండలు, అప్పారావు, బండి రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం

ఖమ్మం వైద్యవిభాగం: జిల్లాలో వివిధ ప్రాంతాలకు చెందిన తేజావత్ కవిత, కాకాని లక్ష్మీనారాయణ, పోలగాని సత్యం, గుంటుపల్లి తిరుపతమ్మ, ఆవుల వెంకటేశ్వర్లు, గజ్జెల వెంకట సత్యనారాయణ, బూక్యా నాను, పుతుంబాక నర్సింహరావు, బండి సత్యం మృతి చెందగా వారి నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. సేకరించిన నేత్రాలను హైదరాబాద్ ఎల్‌వీ ప్రసాద్, వాసన్, అపోలో, అగర్వాల్ ఐబ్యాంక్‌లకు పంపినట్లు ఖమ్మం నేత్రనిధి కార్యదర్శి ఆర్. అనంత పద్మనాభం ఒక ప్రకటనలో తెలిపారు.

ఎకరాకు రూ.50వేలు నష్టపరిహారం ఇవ్వాలి

ఖమ్మంమయూరిసెంటర్/కూసుమంచి: అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతాంగానికి తక్షణమే ఎకరానికి రూ.50 వేలు నష్టపరిహారం చెల్లించాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా, అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా కార్యదర్శులు గోకినేపల్లి వెంకటేశ్వరరావు, ఆవుల వెంకటేశ్వర్లు, అఖిల భారత రైతుకూలీ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బజ్జూరి వెంకట్రామిరెడ్డి, ఏనుగుల ప్రకాష్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట రైతులను ఆదుకోవాలని కోరుతూ ప్రజాపంథా, ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించిన సందర్భంగా వెంకటేశ్వరరావు, వెంకటేశ్వర్లు మాట్లాడారు. అదేవిధంగా కూసుమంచిలో ఏర్పాటు చేసిన సమావేశంలో వెంకట్రామిరెడ్డి, ప్రకాష్‌లు మాట్లాడారు. నష్టపోయిన పంటల్లో మొక్కజొన్న, వరికి ఎకరాకు రూ.30వేలు, మిర్చికి ఎకరాకు రూ.80వేలు, మామిడి కి ఎకరాకు రూ.లక్ష పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం రాష్ట్రంలో అమలు చేయకపోవడంతో నష్టపరిహారం రావటం లేదన్నారు. అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు, నాయకులు జి.రామయ్య, బందెల వెంకయ్య, ఆర్.శివలింగం, ఆవుల అశోక్, సీవై పుల్లయ్య, అర్జునరావు , ఝాన్సీ, ఎస్‌కె. లాల్మియా, లాజరు, మల్లయ్య, రామస్వామి, వీరయ్య, మురళీధర్‌రావు, ఉప్పలయ్య , నాగయ్య, తదితరులు పాల్గొన్నారు.


ఖమ్మంమయూరిసెంటర్: కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ప్రజాపంథా నాయకులు

అంగన్‌వాడీల్లో పోషణ్ పక్షోత్సవాలు

పోషణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం పోషణ్ పక్షోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు తృణ ధాన్యాల్లో ఉండే పోషకాలు, వాటి తయారీపై ఐసీడీఎస్ అధికారులు అవగాహన కల్పించారు. అనంతరం పోషణ మాస ప్రతిజ్ఞ చేయించారు. – కూసుమంచి/ గాంధీచౌక్/ ఖమ్మంమయూరిసెంటర్/ రఘునాథపాలెం


రఘునాథపాలెం: మాట్లాడుతున్న సీడీపీఓ కవిత

కాంగ్రెస్, బీజేపీ నాయకుల ముందస్తు అరెస్ట్

ముఖ్యమంత్రి కేసీఆర్ జిల్లా పర్యటనలో భాగంగా మండలాల్లోని పలువురు కాంగ్రెస్, బీజేపీ నాయకులను గురువారం తెల్లవారజామున పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి ఆ తర్వాత వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు. ఈ అక్రమ అరెస్ట్‌లను ఆయా పార్టీల నాయకులు తీవ్రంగా ఖండించారు. – సాక్షి నెట్‌వర్క్


ఖమ్మం మామిళ్లగూడెం: కొండపల్లి శ్రీధర్‌రెడ్డిని హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు


రఘునాథపాలెం: కాంగ్రెస్ నాయకులను అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించిన దృశ్యం


కూసుమంచి పోలీస్‌స్టేషన్‌లో కాంగ్రెస్, బీజేపీ నాయకులు

భగత్‌సింగ్ స్ఫూర్తితో ఉద్యమించాలి

భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ వంటి ఉద్యమకారులు నేటి యువతకు స్ఫూర్తిదాయకమని పలువురు వక్తలు తెలిపారు. గురువారం మండల కేంద్రాల్లో భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల 92వ వర్ధంతి వేడుకలను ఇఫ్టూ, ఏఐవైఎఫ్, ఏఐఎస్‌ఎఫ్, పీడీఎస్‌యూ, పీవైఎల్ ఆధ్వర్యంలో నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాగడాల ప్రదర్శన నిర్వహించారు. అనంతరం వారు చేసిన సేవలను కొనియాడారు. – సాక్షినెట్‌వర్క్


తిరుమలాయపాలెం: బచ్చోడులో పీవైఎల్ ఆధ్వర్యాన నివాళి


ఖమ్మంమయూరిసెంటర్: నివాళులర్పిస్తున్న సీపీఐ జాతీయ నాయకుడు పువ్వాడ నాగేశ్వరరావు


రఘునాథపాలెం: నివాళులర్పిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు


ఖమ్మంమయూరిసెంటర్: కాగడాల ప్రదర్శన నిర్వహిస్తున్న ఏఐవైఎఫ్, ఏఐఎస్‌ఎఫ్ నాయకులు